క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఎంపీ

తిరుమల: తిరుమల శ్రీవారిని తిరుపతి ఎంపీ గురుమూర్తి సోమవారం దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

వారపు సంతలో అన్నదానం

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో సోమవారం రైతులకు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ వారపు సంతలో రైతులు, చిన్న, సన్నకారు రైతులు ఆకలితో ఉండకూడదని ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. అందరికీ అన్నం పెట్టే రైతులకు అన్ని సమయాల్లో ఎమ్మెల్యే అండగా ఉంటారని పేర్కొన్నారు.

రేపు తలకోనలో దుకాణాలకు వేలం

భాకరాపేట: తలకోన శ్రీసిద్ధేశ్వరస్వామి దేవస్థానం పరిధిలోని శాశ్వత దుకాణాలకు ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఈఓ జయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 దుకాణాలకు నిర్వహించే వేలంలో పాల్గొనే వారు ధరావత్తు సొమ్ము రూ.5000 చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

దామోదరం ఎన్నికపై హర్షం

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘం రెండో ఉపాధ్యక్షుడిగా తిరుపతి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు గ్రేడ్–1 స్టెనో గ్రాఫర్ జి.దామోదరం ఎన్నికపై న్యాయశాఖ ఉద్యోగులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘం ఎన్నికలు ఆదివారం చిత్తూరులో జరిగాయి. తిరుపతిలోని 12 కోర్టుల్లో విధులు నిర్వహించే న్యాయశాఖ ఉద్యోగులు దామోదరంకు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 87,407 మంది స్వామివారిని దర్శించుకోగా.. 31,713 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.47 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని వినతి

తిరుచానూరు(చంద్రగిరి): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయడంతో పాటు వ్యవసాయ రంగానికి మీటర్లను పెట్టవద్దని కోరుతూ తిరుచానూరులో సబ్‌స్టేషన్ ముందు సీపీఎం నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఏఈ గణపతికి వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి, కమిటీ సభ్యులు కందారపు మురళి, జయచంద్ర, జిల్లా కమిటీ సభ్యులు పి.సాయి లక్ష్మి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేంద్ర పాల్గొన్నారు.

కోడింగ్‌పై నిరుద్యోగలకు శిక్షణ

తిరుపతి అర్బన్: సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి కల్పించే దిశగా సీడాప్, డీఆర్‌డీఏ చర్యలు చేపట్టినట్లు ఆ సంస్థ పీడీ జ్యోతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరుకు చెందిన నవగురుకుల్‌తో కలిసి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 50మంది నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ కోడింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న యువతులతోపాటు ట్రాన్స్‌జెండర్స్ కూడా అర్హులుగా పేర్కొన్నారు. అయితే 17–27 ఏళ్ల వయస్సు ఉండాలని స్పష్టం చేశారు. ఏడాది శిక్షణ ఉంటుందని వివరించారు. భోజన సదుపాయలు కల్పిస్తారని.. శిక్షణ సమయంలో ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. అదనపు సమాచారంతోపాటు రిజిస్ట్రేషన్ కోసం 9160912690, 9963561755 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



అర్జునయ్య (ఫైల్)

పాకాల : మండలంలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలోని శంఖంపల్లి వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. శంఖంపల్లికి చెందిన ఎం.నాగయ్య కుమారుడు ఎం.అర్జునయ్య(46) రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అర్జునయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంసంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ ఓబులేశు ఆదేశాలతో ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతమ్మనగర్‌ను నాశనం చేసింది చంద్రబాబే

- రోడ్లేసి పుణ్యం కట్టుకోండి
- ఎమ్మెల్యే భూమనకు స్థానికుల మొర
- అన్నీ సౌకర్యాలు కల్పిస్తామని కరుణాకరరెడ్డి హామీ



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి తుడా: అష్టకష్టాలు పడుతూ ఏళ్లతరబడి ఇక్కడే ఉంటున్నాం.. తరాలు గడుస్తున్నా కనీస సౌకర్యాలకు నోచుకోలేక పోయాం.. కారుచీకట్ల తోనే నెట్టుకొచ్చాం.. లేనిపోని నిబంధనలు చెప్పి మా సీతమ్మనగర్ ప్రాంతాన్ని చంద్రబాబునాయుడే సర్వనాశనం చేశాడు అంటూ స్థానికులు ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి వద్ద మొరపెట్టుకున్నారు. మా కాలనీకి రోడ్లు వేసి పుణ్యం కట్టుకోండి అంటూ మహిళలు ఎమ్మెల్యేను అభ్యర్థించారు. గడప గడపకు ‘మన ప్రభుత్వం’ కార్యక్రమంలో భాగంగా సోమవారం 20వ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పర్యటించారు. సీతమ్మనగర్‌లో కొందరు మహిళలు ఎమ్మెల్యేకు తమ సమస్యలను విన్నవించారు. చంద్రబాబునాయుడు పార్టీవోళ్లు మా కాలనీ అభివృద్ధి చెందకుండా ఇబ్బందులు పెట్టారు. ఎన్నికలప్పుడు అదిచేస్తాం.. ఇదిచేస్తాం అని మాటలు చెప్పి చిన్నపాటి అభివృద్ధి కూడా చేయలేదని తమ గోడును వెళ్లగక్కారు. దీనిపై ఎమ్మెల్యే భూమన స్పందిస్తూ.. సీతమ్మనగర్‌కు కరెంటు నేనే ఇచ్చా.. నీళ్లూ నేనే ఇచ్చా..రోడ్లు కూడా నేనే వేయిస్తా.. అంటూ స్థానికులకు హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా సీతమ్మనగర్ అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ఇళ్ల స్థలాలపై సర్వహక్కులూ మీవే అవుతాయని అభయం ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. జగనన్న ప్రభుత్వానికి అండగా ఉంటే మరింత మంచి చేకూరుతుందని వివరించారు.

టీడీపీ అధికారంలోకి రావడం కల

తనకు అధికారం రావడం ఇక కలేనని చంద్రబాబు నాయుడుకు బాగా తెలుసునని.. ఆయన అనుకూల మీడియా జాకీలతో పైకిలేపే ప్రయత్నాలు చేస్తోందని ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి విమర్శించారు. సీతమ్మనగర్ ప్రాంతంలో 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో అంతర్గత రోడ్లన్నింటినీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. జగనన్న ప్రభుత్వం పేదలు బాగుపడాలనే ఆకాంక్షిస్తుంటే, గత చంద్రబాబు పాలనంతా కాకులను కొట్టి గద్దలకు వేసినట్లు కార్పొరేట్‌కు కొమ్ముకాశాడని విమర్శించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే అందరికీ మంచి జరుగుతుందన్నారు. కార్పొరేటర్లు రాజమ్మ, ఆరణి సంధ్య, మునిరామిరెడ్డి, నాయకులు వెంకటముని రెడ్డి, తిమ్మారెడ్డి, మబ్బునాదముని రెడ్డి, డిష్ చంద్ర, బ్రహ్మానందరెడ్డి, కుమార్, కుమార్ రెడ్డి, అనిల్, జీవరత్నం, మాకం చంద్ర, రమేష్‌రెడ్డి, రాజేష్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి భూమన భరోసా



ట్రైసైకిల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి ఓటేరుకు చెందిన ఆశీష్‌కి దురదృష్టవశాత్తు చిన్నతనంలోనే కాళ్లు చచ్చుబడ్డాయి. అందరి విద్యార్థుల్లా నడిచి స్కూల్‌కి వెళ్లలేని దీనస్థితి. మరోవైపు పేదరికం కూడా శాపంగా మారింది. అయినా సరే చదువుకోవాలన్న పట్టుదల ముందు అవేవీ ఆటంకమనిపించలేదు. ప్రతి రోజూ తన కాళ్లతో ఈడ్చుకుంటూనే స్కూల్‌కి వెళ్లిరావడం అందర్నీ కలచివేసేది. విషయాన్ని ఓటేరు స్కూల్ ఇంగ్లిష్ టీచర్ శశికళ తన భర్త, వైఎస్సార్‌సీపీ నేత దేవదానంకు చెప్పింది. ఆయన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో భూమన చలించిపోయారు. వెంటనే ట్రై సైకిల్ తెప్పించి పద్మావతిపురంలోని తన నివాసం వద్ద సోమవారం ఉదయం ఆశీష్‌కి అందజేశారు. మంచిగా చదువుకోవాలని ఆశీర్వదించారు.

చెవిరెడ్డి ‘రక్తబంధం’!



కందులవారిపల్లి పంచాయతీలో జరుగుతున్న ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

- ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన
- రక్త పరీక్ష కేంద్రాలకు తరలివస్తున్న జనం
- ఉచితంగా 56 పరీక్షలు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం చెవిరెడ్డి కుటుంబం చేస్తున్న ఆరోగ్య సేవ అద్భుతమని గ్రామీణులు బ్రహ్మరథం పడుతున్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించాలన్న తపనతో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రతి గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయించారు. ఈ శిబిరాల ద్వారా అందరికీ 56 రకాల ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారు. గ్రామాలలో జరుగుతున్న ఆరోగ్య పరీక్షలకు జనం నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరూ రక్త పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవడం పట్ల అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఆరోగ్య కేంద్రాల్లో జరుగుతున్న వైద్య పరీక్షల పట్ల ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో ఇప్పటికే ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయడం, అక్కడి జనం నుంచి విశేష స్పందన లభించడంతో రెట్టింపు ఉత్సాహంతో నిర్వాహకులు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. తాజాగా చంద్రగిరి మండలంలోని పనపాకం, కల్‌రోడ్డుపల్లి, ఎం.కొంగరవారిపల్లి, అగరాల, ఐతేపల్లి, కొటాల, రామిరెడ్డి పల్లి, చిన్నరామాపురం, కందులవారిపల్లి, ఎ.రంగంపేట గ్రామ పంచాయతీల పరిధిలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. చంద్రగిరి మండలంలో నిర్వహిస్తున్న శిబిరాలను ప్రతి నిత్యం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. వచ్చే ప్రజలకు భోజనం, అల్పాహారం అందిస్తున్నారు.

క్యూ కడుతున్న జనం

గ్రామాల్లో జరుగుతున్న రక్త పరీక్షలకు పల్లె ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఉచితంగా జరిగే రక్త పరీక్షలను ప్రయివేటు లాబొరేటరీలలో చేయించుకోవాలంటే వేలాది రూపాయలు చెల్లించాలని, అలాంటి పరీక్షలు ఉచితంగా చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి ప్రారంభమవుతున్న రక్త పరీక్షలకు అల్పాహారం తినకముందే జనం వచ్చి రక్తం ఇస్తుండడంతో అందరికీ అక్కడే అల్పాహారం ఏర్పాటు చేశారు. తర్వాత మధ్యాహ్న భోజనంతో పాటు సాయంత్రం 7 గంటల వరకు నిరంతరాయంగా రక్త నమూనాలు సేకరిస్తుండడంతో పల్లె వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గరుడ వాహనంపై కనువిందు



గరుడ వాహనంపై విహరిస్తున్న కల్యాణ వెంకన్న

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాల్లో చివరి రోజైన సోమవారం రాత్రి స్వామివారు తనకిష్టమైన గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. అనంతరం లక్ష్మీహారాన్ని ఆలయ ప్రదక్షిణగా అలంకార మండపంలోకి తీసుకురాగా.. రాత్రి గరుడ వాహనంపై స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ ముని చెంగల్రాయులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు హర్షణీయం

తిరుపతి ఎడ్యుకేషన్: ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ప్రతి జిల్లాలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మూడో శుక్రవారం ఆయా జిల్లాల్లోని కలెక్టరేట్, హెచ్ఓడీ కార్యాలయాల్లో గ్రీవెన్స్ డే ఏర్పాటు చేయాలని ఆదేశించడం శుభపరిణామమన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలలో ఆకస్మిక తనిఖీలు



హోటల్ వద్ద సహాయ కార్మిక కమిషనర్ బృందం

తిరుమల: తిరుమలలో బాల కార్మికులను గుర్తించేందుకు కార్మికశాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సహాయ కార్మిక కమిషనర్ బీపీఏ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఎస్.చిన్నలారెప్ప, శ్రీమన్నారాయణ, రాజయ్య, రంగనాథ్ బృందం స్థానిక ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్, చుట్టుపక్కల హోటల్స్, దుకాణాల్లో తనిఖీలు చేపట్టింది. తిరుమలలో బాలకార్మికులు ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలను చేపట్టినట్టు వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో షికారీ హాకర్స్ పిల్లలు బొమ్మలు, ఇతర వస్తువులు అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు. వారిని టీటీడీ అధికారులు పునరావాసానికి తరలించాలని సూచించినట్లు తెలిపారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దాం

రామచంద్రాపురం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దామని ఎంఈఓ–2 జయవేలు అన్నారు. సోమవారం మండలంలోని ఆర్సీపురం ఎస్టీకాలనీ ప్రాథమిక పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల కమిటీ సమావేశానికి హాజరయ్యారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మన బడి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించిందని చెప్పారు. నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు వీ లవ్ రీడింగ్, లెర్న్ ఏ వర్డ్ ఏ డే వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకుందాం

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఐక్యతతో సమస్యలను పరిష్కరించుకుందామని శ్రీమూలస్థాన ఎల్లమ్మ చంద్రగిరి మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్ అన్నారు. చంద్రగిరిలో మెకానిక్ అసోసియేషన్ సభ్యుల సమావేశం సోమవారం జరిగింది. మెకానిక్‌లకు ఎవరికైనా సమస్య వస్తే ఉమ్మడిగా ఆదుకోవాలని తెలిపారు. ఐతేపల్లికి చెందిన మెకానిక్ మహమ్మద్ బాషా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బీమాను అధికారులతో మాట్లాడి వచ్చేలా చూస్తామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శులు హరి, మార్కొండ, పళణి, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



కలెక్టర్‌తో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావ

తిరుపతి అర్బన్: బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు తెలిపారు. కలెక్టరేట్‌లో వెంకటరమణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బాల కార్మిక చట్టం అమలు చేసి బాలలను పరిరక్షించడం తమ కర్తవ్యమన్నారు. చిన్న వయసులోనే బాల్య వివాహాలను చేయడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యానికి వచ్చే ఇబ్బందులు వివరించాలని చెప్పారు.ఈనెల 30వ తేదీ వరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రణాళికలు రచించుకుని వివిధ శాఖల అధికారులు పనిచేయాలన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి జయలక్ష్మి ఉన్నారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించండి

తిరుపతి తుడా: భారతీయ సంప్రదాయ చేనేత ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, నగర మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. స్థానిక ఇందిరా మైదానంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను సోమవారం ప్రారంభించారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆదరించాలని కోరారు. తద్వారా చేనేత, హస్తకళల ఉత్పత్తులను ప్రోత్సహించినట్లవుతుందని చెప్పారు.

నేత్రపర్వంగా గోవిందుడి పుష్పయాగం





శ్రీగోవిందరాజస్వామి వారికి పుష్పయాగం చేపడుతున్న అర్చకులు, పుష్పాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారికి సోమవారం కన్నుల పండువగా పుష్పయాగాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ఏపీ.శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు అర్చకుల వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగవైభవంగా పుష్పయాగాన్ని నిర్వహించారు. మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు వంటి 12 రకాల సంప్రదాయ పుష్పాలు, తులసి, మరువం, దమణం, బిల్వం, పన్నీరాకు పత్రాలు కలిపి మొత్తం 3 టన్నులతో పుష్పయాగాన్ని నిర్వహించారు. ఈ పుష్పాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాతలు విరాళంగా అందజేశారు. గత మే 26 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు, నిత్యకైంకర్యాలు, అర్చక పరిచారకులు, అధికారులు, భక్తులతో తెలిసీతెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. కాగా సాయంత్రం స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏఈవో రవికుమార్, సూపరింటెండెంట్ మోహన్‌రావు పాల్గొన్నారు.

స్వచ్ఛ తిరుపతిలో ప్రజల భాగస్వామ్యం

- అప్పుడే క్లీన్ తిరుపతి సాధ్యం
- కమిషనర్ హరిత



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: స్వచ్ఛ తిరుపతిలో నగర ప్రజలను పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత సూచించారు. స్పందన, డయల్ యువర్ కమిషనర్ ప్రజా వినతుల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో స్వచ్ఛ తిరుపతిపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతలో పరిపూర్ణత సాధించాలంటే ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. రోడ్లు, కూడళ్లు, కాలువల్లో చెత్త పారబోసే వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. నగరంలో కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని, శానిటేషన్ విషయంలో ఎవరూ అశ్రద్ధ వహించవద్దన్నారు. వ్యాపార సముదాయాలు ఉండే వీధుల్లో ఇష్టారాజ్యంగా రోడ్లపై వ్యర్థాలు పారబోస్తున్నారని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఐచర్

- ఇద్దరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సయ్యద్ ముత్తకిమ్



నుజ్జునుజ్జు అయిన ట్రాక్టర్, ఐచర్ వాహనం

చంద్రగిరి(తిరుపతి రూరల్): పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి చంద్రగిరి మండలం, తొండవాడ సమీపంలో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. సదుం మండలం, శ్రీనివాసపురానికి చెందిన సయ్యద్ ముత్తకిమ్ ట్రాక్టర్‌లో మామిడికాయలను సదుం నుంచి తిరుచానూరు మార్కెట్ యార్డ్‌లో విక్రయించి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా చంద్రగిరి మండలం, తొండవాడ సమీపంలో వెనుక నుంచి తిరుపతి వైపు నుంచి అరటికాయాల లోడ్‌తో కేరళకు వెళుతున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న సయ్యద్ ముత్తకిమ్, సదుం మండలం ఉతుపల్లికి చెందిన సదుం తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తలకోనలో సిద్ధ పూజ

భాకరాపేట: తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సిద్ధ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు, అలంకరణ చేశారు. సాయంత్రం ప్రదోశ కాలంలో స్వామిఅమ్మవారు నంది వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించారు.

అందుకే బీఆర్‌ఎస్‌లో చేరా

తిరుపతి కల్చరల్: కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షుడుగా ఒకే కులానికి సేవ చేసేవాడినని.. అన్ని కులాలకు సేవ చేయాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ పార్టీలో చేరానని ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కాపు సంక్షేమ సేనకు రాజీనామా చేసి బీఆర్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ సమక్షంలో పార్టీలో చేరినట్లు చెప్పారు. త్వరలో తిరుపతిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.32.24 లక్షలు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.32,24,024 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య, చైర్మన్ కట్టా గోపియాదవ్ తెలిపారు. సోమవారం దేవదాయశాఖ అధికారి పి.ఫణిరాజశయన పర్యవేక్షణలో ఆలయ ఆవరణలో కానుల లెక్కింపు చేపట్టారు. నగదుతో పాటు 46.75 గ్రాముల బంగారం, 131.6 గ్రాముల వెండి వచ్చినట్లు వెల్లడించారు.

మాదకద్రవ్యాలతో పట్టుబడితే కఠిన శిక్షలు

తిరుపతి లీగల్: మాదక ద్రవ్యాలను తీసుకోవడం, విక్రయించడం తీవ్ర నేరమని ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక కోర్టు జడ్జి శ్రీకాంత్ తెలిపారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలోని పాస్ సంస్థలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలను విక్రయించడం, తీసుకోవడం నేరమన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

క్రమశిక్షణతోనే మంచి భవిష్యత్తు

పాకాల: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలిగితే మంచి భవిష్యత్తు ఉంటుందని సీఐ ఓబులేసు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మత్తుతో జీవితం చిత్తు

తిరుపతి ఎడ్యుకేషన్: మత్తుపదార్థాల వాడకంతో వ్యక్తి జీవితంతో పాటు వారి కుటుంబ సభ్యుల జీవితాలు చిత్తవుతాయని మహిళా వర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ కె.హేమావతి అన్నారు. ఎమ్మార్‌పల్లి జెడ్పీ హైస్కూల్లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మత్తుపదార్థాల ప్రభావం వల్ల చెడు వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదం ఉందన్నారు. జీవితాలు కుదేలవుతాయని చెప్పారు.

మాదకద్రవ్యాల నిర్మూలనతోనే మానవ మనుగడ

ఎస్వీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వై.గంగాధర్‌రావు మాట్లాడారు. మాదక ద్రవ్యాలు సమాజం, ఆరోగ్యంపై ఏ విధమైన దుష్ప్రభావాలు చూపుతాయో వివరించారు.